ఎక్కడి చెత్త అక్కడే..

- ఇళ్లలో చెత్త సేకరణలో సిబ్బంది నిర్లక్ష్యం
- రోడ్లపై పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- మన్సూరాబాద్‌లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం





మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద రోజుల తరబడి కుప్పలుగా పడిఉన్న చెత్తాచెదారం

మన్సూరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణ సరిగ్గా లేక మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆగమయ్యనగర్, అమ్మదయకాలనీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఇళ్లల్లో చెత్తసేకరణ చేయకపోవడం, రోడ్ల పక్కన వేసిన చెత్తను తొలగించకపోవడంతో రోజులు, నెలల తరబడి చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోతుంది. దీంతో ముక్కుపుటాల దిరేలా దుర్గంధం వెదజల్లుతుండడంతో అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పలువురు అనారోగ్యం బారిన పడుతున్న పరిస్థితి నెలకొంది. ఆగమయ్యనగర్, అమ్మదయ కాలనీల్లోని దాదాపు అన్ని రోడ్లలో ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఇళ్లల్లోని చెత్త సేకరణ చేసేందుకు పారిశుధ్య సిబ్బంది సరిగా రాకపోవడంతో



అమ్మదయ కాలనీ పార్కు వద్ద చెత్త, ఇతర వ్యర్థాలు

ఆగమయ్యనగర్ కాలనీ రోడ్డు పక్కన చెత్తాచెదారం, చెట్ల కొమ్మలు

ఇళ్లల్లో చెత్తను ఉంచుకోలేక రోడ్లపై పడేయాల్సిన దుస్థితి ఏర్పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.

అసలే వర్షాకాలం కావడం.. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించకపోవడంతో రోడ్లపై చెత్త చెల్లాచెదురుగా పడటంతో స్థానికులతో పాటు అటుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగం నిర్లక్ష్యాన్ని వీడి ఇళ్లల్లో, కాలనీల్లో చెత్త, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని పలువురు కాలనీవాసులు పేర్కొంటున్నారు.

డ్రైనేజీ లైన్ తవ్వారు... పని పూర్తి చేయకుండానే వదిలేశారు

హయత్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది నిర్వాకం వల్ల కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. మున్సిపాలిటీలోని మునగనూరు గ్రామంలోని రామానుజనగర్ కాలనీ బ్యాంకు కాలనీ రోడ్డులో పది రోజుల క్రితం డ్రైనేజీ లైన్ జాం అయిందని శానిటేషన్ సిబ్బంది గుంతను తవ్వారు. పని పూర్తి చేయకుండానే నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో మురుగునీరు గుంతలో చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. సిబ్బందికి ఫోన్ చేసి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరగా చూద్దాం.. చేద్దాం అంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



మునగనూరులో తవ్వి వదిలేసిన డ్రైనేజీ గుంత

అనాథాశ్రమంలో దుప్పట్లు, చాపలు పంపిణీ

సరూర్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని మాతృ దేవోభవ అనాథాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అభాగ్యులకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు అంకంగారి కుమార్‌గౌడ్, ఆయన కుమారుడు కౌశిక్‌గౌడ్ కలిసి మంగళవారం దుప్పట్లు, చాపలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రస్తుతం చలి వాతావరణం ఉండడంతో ఆయా వస్తువులు వారికి అందజేసినట్టు కుమార్‌గౌడ్ తెలిపారు. పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీలో కాచం సత్యనారాయణ గుప్తా తదితరులు

తెలంగాణ వ్యాపారుల పొట్టగొడుతున్న మార్వాడీలు

మన్సూరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన కొందరు మార్వాడీలు మోసపూరిత వ్యాపారాలు చేస్తూ తెలంగాణ వ్యాపారుల పొట్టకొడుతున్నారని, ఇలాంటి వారిని రాష్ట్రం నుంచి తరిమికొడదామని వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. దాడులు, మోసపూరిత వ్యాపారాలకు పాల్పడుతున్న కొందరు మార్వాడీ వ్యాపారుల వైఖరిని నిరసిస్తూ కాచం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో 'గుజరాత్, రాజస్థాని మార్వాడీ వ్యాపారి హఠావో - తెలంగాణ వ్యాపారి బచావో' నినాదంతో ఎల్బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి రింగురోడ్డు వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాచం మాట్లాడుతూ దేశంలో ఎవరైనా ఎక్కడైనా వ్యాపారులు చేసుకోవచ్చు, కానీ మోసపూరితపు వ్యాపారాలు సాగిస్తూ స్థానిక వ్యాపారుల పొట్టగొట్టే వారికే తాము వ్యతిరేకమని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ నాయకులు పాండురంగాచారి, సల్వాచారి, రామాచారి, తెలంగాణ వనరుల పరిరక్షణ సమితి నాయకుడు శ్యాంసుందర్‌గౌడ్, యాదవ సంఘం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌యాదవ్, ట్రేడ్ యూనియన్ నాయకులు శ్రవణ్‌కుమార్ గుప్తా, శ్రీధర్, రమేష్, వైశ్య వికాస వేదిక నాయకులు రమేష్, ఎన్.రమేష్, నిఖిల్, ప్రవీణ్, టీజేఎస్ నాయకుడు రవి కుమార్ గుప్తా, పెద్ద ఎత్తున వైశ్య వ్యాపార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పనులు చేయకుండానే నిధుల దుర్వినియోగం విచారణ చేపట్టండి : కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పనులు చేయకుండానే లక్షలాది రూపాయలు కాజేశారని, విచారణ చేపట్టాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డ ఇంజనీరింగ్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సొమ్ము రికవరీ చేయాలన్నారు. డీఎస్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం రూ.18.60లక్షలు, అంగన్‌వాడీ సెంటర్ పక్కన మరో కమ్యూనిటీ హాల్ నిర్మాణంలో మిగిలిన పనులకు రూ.10.50 లక్షలు, ఎస్‌బీహెచ్ కాలనీ నుంచి సుబ్రమణ్యం నగర్ వరకు బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులకు రూ. 22 లక్షలు కేటాయించి టెండర్ ఖరారు చేశారని పేర్కొన్నారు. పనులు ప్రారంభించకుండానే పూర్తి చేసినట్లుగా కాంట్రాక్టర్లు జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కుమ్మక్కై బోగస్ పత్రాలు, ఎంబీ బుక్కులు సృష్టించి నిధులు కాజేశారని ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ద్వారా అధికారులు ఇచ్చిన పనుల వివరాలను కమిషనర్‌కు అందజేశారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

వనస్థలిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చెయాలని కాంట్రాక్టర్, అధికారులకు వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. వనస్థలిపురం డివిజన్ వనస్థలిహిల్స్ కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ విగ్నేశ్వరీ, కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి'

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉష సూచించారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత మామిడి తోటల పునరుజ్జీవం, వాతావరణ బులిటెన్, డిజిటల్ వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాస్త్రవేత్తలు రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.పల్లవి, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్ రఘు, రైతులు పాల్గొన్నారు.

'లాబెర్రీ యాప్‌తో న్యాయవాదులకు ఉపయోగం'

రంగారెడ్డి జిల్లా కోర్టు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): లాబెర్రీ యాప్ న్యాయవాద వృత్తిలో ఉన్నవారికి ఎంతో ఉపకరిస్తుందని యాప్ ప్రతినిధి సంగీత శాలిని తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి కరుణాకర్‌రావుతో పాటు పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లాబెర్రీ గురించి కూలంకశంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్ బాసెట్టి, మహిళా ప్రతినిధి అనసూయ తదితరులు పాల్గొన్నారు.

వీఎం హోంలో దివ్యాంగ నిర్ధారణ పరీక్షలు

ఎల్బీనగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోంలో మంగళవారం దివ్యాంగ విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆల్ ఇండియా మ్యానుఫ్యాక్చర్ కంపెనీ వారిచే ఉచిత ఉపకరణాలు పంపిణీ చేయడానికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు కోఆర్డినేటర్ వెంకటేష్ తెలిపారు. సరూర్‌నగర్, బాలాపూర్, హయత్‌నగర్, మహేశ్వరం, కందుకూరు, ఆమనగల్ మండలాలకు చెందిన విద్యార్థులకు ఈ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వీఎం హోం గౌరవ కార్యదర్శి రామారావు, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, వైస్‌ప్రిన్సిపాల్ శివప్రసాద్, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు

చాదర్‌ఘాట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మంగళవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాలకు చెందిన 120 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 32 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని పరీక్షల ద్వారా వెల్లడైందని వైద్యాధికారి డాక్టర్ తరుణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది స్వరూప, రేణుక, రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యనగర్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

వనస్థలిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ చైతన్యనగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ చైతన్యనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షులు జలందర్ రెడ్డి, శివకుమార్, రామ్‌రెడ్డి, యాదయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ బోనాలు

హయత్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని తొర్రూర్‌లో రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున్న మహిళలు పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంరెడ్డి బుజంగరెడ్డి, గుత్త వెంకటరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.



రేణుకా ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

విద్యుత్ అధికారుల స్పెషల్ డ్రైవ్

- ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగల గుర్తింపు



చంచల్‌గూడలో టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహులు, మెట్రో జోన్ సీజీఎం ప్రభాకర్ తదితరులు

చాదర్‌ఘాట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేలాడుతున్న విద్యుత్ తీగలు, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ వైర్లను గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు విద్యుత్ ఉన్నతాధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మంగళవారం ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్‌లోని చంచల్‌గూడ సబ్ డివిజన్ పరిధిలోని చంచల్‌గూడ, చాదర్‌ఘాట్, మలక్‌పేట సెక్షన్‌లలో టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహులు, మెట్రో జోన్ సీజీఎం ప్రభాకర్, సౌత్ సర్కిల్ ఎస్ఈ వెంకన్నతో కలిసి ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీఈ శోభన్, ఏఈలు ప్రసాద్, సంతోష్, సోహేల్, భాస్కర్ సిబ్బంది బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. రామంతాపూర్‌లో విద్యుదాఘాతంతో ఐదుగురు మృతిచెందిన ఘటనతో చంచల్‌గూడ సబ్ డివిజన్‌లో విద్యుత్ ఉన్నతాధికారుల బస్తీబాటకు ప్రాధాన్యం సంతరించుకుంది. చంచల్‌గూడ, చాదర్‌ఘాట్ సెక్షన్ల పరిధిలో వేలాడుతున్న విద్యుత్ తీగలను బిగించేందుకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కండక్టర్లు, ఫ్యూజ్‌ల మార్పిడికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. శంకర్‌నగర్ బస్తీలో కూలేందుకు సిద్ధంగా ఉన్న మూడు విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటి స్థానంలో వెంటనే కొత్తవి ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. కిలో మీటర్ల పొడవునా ఎల్‌టీ విద్యుత్ లైన్‌ను మార్చేందుకు చర్యలు చేపట్టారు. వీటితో పాటు ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలకు బిగించిన కేబుల్ వైర్లను పూర్తిగా తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహులు ఆదేశించారు.

చవితి, నవరాత్రుల సందర్భంగా..

ఎల్బీనగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి, దసరా నవరాత్రులను పురస్కరించుకుని విద్యుత్ అధికారులు ఆర్‌కేపురం డివిజన్‌లో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. విద్యుత్ సరఫరా మెరుగు తీసుకోవాల్సిన చర్యలను విద్యుత్ ఎస్ఈ లక్ష్మీనారాయణ, ఏడీఈ హనుమంత్, ఏఈ మధుసూదన్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ స్తంభాలపై అనుమతి లేకుండా కుప్పలుగా ఏర్పాటు చేసిన కేబుల్, ఇంటర్నెట్ వైర్లను తొలగించాలని అధికారులకు సూచించారు. వినాయక మండపాలకు విద్యుత్ సరఫరాను సులువుగా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ ఖిల్లా మైసమ్మ దేవాలయం డైరెక్టర్ పగడాల శ్రీశైలం, పెద్దఫూర సైదులు, శ్రీధర్, పెరిక అశోక్, విప్లవ్‌రెడ్డి, బొడ్డుపల్లి నగేష్, ప్రశాంత్‌యాదవ్, ఆకాష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో మెగా జాబ్ మేళా

- 207 మందికి ఉద్యోగావకాశాలు

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని సిమ్లా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. డెక్కన్ బ్లాస్టర్ కంపెనీ చైర్మన్ మన్నన్ ఉల్లాఖాన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా జరిగింది. పెద్దఎత్తున నిరుద్యోగులు హాజరయ్యారు ఐటి సెక్టార్, బ్యాంకింగ్, మెడికల్, పలు ప్రైవేటు, నాన్ ఐటీ సెక్టార్‌కు సంబంధించిన సుమారు 50 సంస్థలు జాబ్ మేళాలో పాల్గొని వారికి కావాల్సిన అర్హతలున్న ఉద్యోగులను ఏంపిక చేసుకున్నారు. జాబ్ మేళాలో 2,300 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 207 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఏంపికయ్యారు. ఏంపికైన అభ్యర్థులకు వెంటనే ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓమర్‌మస్కతి, ఫరీద్, నస్రీం, జోహబ్, పలు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎఫ్‌సీఐకాలనీ ప్రధాన రహదారిపై వరదలో నిలబడి నిరసన తెలుపుతున్న శ్రీనివాస్, కాలనీవాసులు

వరదనీటి సమస్యను పరిష్కరించండి

వనస్థలిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న వరదనీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి నూతి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీ ప్రధాన రహదారిపై చేరిన వరదనీటిలో నిలబడి కాలనీసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా కార్యదర్శి నూతి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ఎఫ్‌సీఐ కాలనీ రహదారిపై వరద నీరు వల్ల సుమారు పదిహేను కాలనీల వారు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వరదనీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో పరిసర కాలనీవాసులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చెపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌సీఐ కాలనీ అధ్యక్షుడు నర్సింహారావు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాజుయాదవ్, వెంకటేష్, మధుకర్‌గౌడ్, రక్షిత్‌రెడ్డి, మాల్యాద్రి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రేషన్ దరఖాస్తుల విచారణకు సహకరించాలి

- తహసీల్దార్ వేణుగోపాల్

ఎల్బీనగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తుల విచారణకు రెవెన్యూ కార్యాలయం నుంచి వచ్చిన అధికారులకు ప్రజలు సహరించాలని సరూర్‌నగర్ తహసీల్దార్ పి.వేణుగోపాల్ సూచించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సరూర్‌నగర్ మండలం అర్బన్ పరిధిలోకి వస్తుందని రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ పౌరసరఫరాల శాఖ అధికారులు చూస్తారని తెలిపారు. ప్రజలు రేషన్‌కార్డు కోసం మీసేవలో దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు విచారణ చేసి పౌరసరఫరాల శాఖ అధికారులకు నివేదిక అందజేస్తారన్నారు. విచారణ సమయంలో తప్పుడు సమాచారం ఇచ్చిన వారికి రేషన్‌కార్డులు మంజూరు కావని ఆయన పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ లాగిన్‌లో ఎంటర్ చేసేటప్పుడు దరఖాస్తు చేసుకున్న వారి ఆధార్ నంబర్ లింక్ అయి ఉండటం వల్ల వారికి సంబంధించిన స్థిర, చరాస్తుల వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ నుంచి సరూర్‌నగర్ మండలానికి 9,500 దరఖాస్తులు విచారణ కోసం వచ్చాయని తెలిపారు. వాటిలో దాదాపు 25 శాతం దరఖాస్తుల విచారణ పూర్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో నిధుల గోల్‌మాల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో రోగుల డైట్ పేరుతో లక్షల రూపాయల గోల్‌మాల్ జరిగిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇటీవల ఆస్పత్రి తాత్కాలిక సూపరింటెండెంట్ ఆడిట్ చేయగా ఈ బాగోతం బయటపడింది. ఆస్పత్రిలో 204 పడకలు ఉన్నప్పటికీ రోజుకు గరిష్ఠంగా 40-50 మంది మాత్రమే ఇన్‌పేషెంట్లుగా ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. కానీ 170-180 మందికి డైట్ ఇస్తున్నట్లు లెక్కల్లో చూపి అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి నెలా గరిష్ఠంగా రూ.4.6 లక్షల వరకు డైట్ బిల్లులు వస్తుండగా, అందులో సగం పక్కదారి పడుతోంది. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు ప్రారంభమై పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు.

ఘనంగా అంతర్జాతీయ ఫొటోగ్రఫీ డే

మన్సూరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలను మంగళవారం నాగోల్‌లో ఘనంగా నిర్వహించారు. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాగోల్ అధ్యక్షుడు జె.సహదేవ్ ఆధ్వర్యంలో డాగురే జయంతి సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.మల్లికార్జున్, కోశాధికారి ఎ.కిషన్, సురేష్, ఉస్మాన్, ప్రశాంత్, రమేష్, భాను, నర్సింహ, సుభాష్, శ్రీశైలం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



లూయిస్ డాగురే జయంతి కేక్‌ను కట్ చేస్తున్న సహదేవ్ తదితరులు



అబ్దుల్లాపూర్‌మెట్‌లో లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

లూయిస్ డాగురేకు నివాళి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెరుకు శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో లూయిస్ డాగురే చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుక్క స్వామి, మండల మాజీ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్, టి.శివగౌడ్, మేడిపల్లి బాల్‌రాజ్‌గౌడ్, విజయ్‌కుమార్, సల్మాన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ విద్యుత్ షాక్ ఘటనలో.. ఒవైసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అఖిలేష్

చంపాపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహం తరలిస్తుండగా బండ్లగూడలో సోమవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురైన హాస్నేహాలాంకు చెందిన అఖిలేష్(22) కంచన్‌బాగ్‌లోని ఒవైసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. డాక్టర్లు అఖిలేష్‌కు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. మంగళవారం ఉదయం చంద్రాయణగుట్ట ఏసీపీ సుధాకర్, కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ ఒవైసీ ఆస్పత్రిని సందర్శించి అఖిలేష్ ఆరోగ్య పరిస్థితులపై డాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

76 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్

కొత్తపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 76 మంది మద్యం ప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో మంగళవారం రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్‌హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలుత సిబ్బంది రమేష్ వారికి మద్యంమత్తులో వాహనాలు నడిపే వారి వీడియో క్లిప్పింగ్స్, మద్యం మత్తులో ప్రమాదాలపై ప్రముఖుల సందేశాలు గీతాలు ప్రదర్శించారు. వీడియోల్లోని అంశాలను వారికి వివరించారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

రాచకొండ పరిధిలోని బీబీనగర్, కొండమడుగు ప్రాంతాల్లో 5 ప్రభుత్వ, 4 ప్రైవేటు విద్యాసంస్థల్లో 534 మంది విద్యార్థులకు మంగళవారం వీడియోలు ప్రదర్శిస్తూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్, ఏఎస్ఐ సోమ్‌నాథ్ తెలిపారు. తెలుగు, ఇంగ్లీషు సూచనలతో రూపొందించిన ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ ఫర్ చిల్డ్రన్ బుక్‌లెట్స్ విద్యార్థులకు పంపిణీ చేశామని వారు తెలిపారు.

కుంట్లూర్‌లో ఆర్ఎంసీ రెడీమిక్స్ ప్లాంట్ సీజ్

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ కుంట్లూర్ సర్వే నంబర్ 177లోని ఆర్ఎంసీ రెడీమిక్స్ ప్లాంట్‌ను మంగళవారం మున్సిపల్, పోల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సీజ్ చేశారు. కొంత కాలంగా ఏలాంటి అనుమతులు లేకుండానే ప్లాంట్‌ను కొనసాగిస్తుండంతో గ్రామస్థులు మున్సిపల్ అధికారులతో పాటు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ టీపీవో మధు, పోల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ మహేష్ సిబ్బందితో అక్కడికి వెళ్లి ప్లాంట్‌ను సీజ్ చేశారు. అనుమతులు తీసుకున్న తర్వాతనే తిరిగి ప్లాంట్‌ను ప్రారంభించాలని నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ పోలీసులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

హయత్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన నిమ్మ సుమన్‌రెడ్డి (30) ప్రైవేటు ఉద్యోగి. తండ్రి చనిపోవడంతో తల్లి వద్దనే ఉంటున్నాడు. సోమవారం తల్లి పని మీద బయటకు వెళ్లి రాత్రి తొమ్మిది గంటలకు ఇంటికి చేరుకుంది. అప్పటికే సుమన్‌రెడ్డి చీరతో ఫ్యానుకు ఉరేసుకుని మృతిచెంది ఉన్నాడు. వెంటనే తల్లి స్థానికుల సాయంతో హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురికి తరలించారు. సుమన్‌రెడ్డి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ కార్డు పరిమితి పెంచుతానని మోసం

- రూ. లక్షా 30 వేలు పోగొట్టుకున్న బస్ డ్రైవర్

కొత్తపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు పరిమితి పెంచుతానని నమ్మించి కాలేజీ బస్ డ్రైవర్ నుంచి రూ. లక్షా 30 వేలు దోచుకున్నారు సైబర్ నేరగాళ్లు. ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ ఆర్టీసీ కాలనీలో ఉండే కె.సాల్మన్‌రాజు(53) కాలేజీ బస్ డ్రైవర్. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తి సాల్మన్‌రాజుకు ఫోన్ చేసి తన పేరు అనంత్‌సింగ్ అని పరిచయం చేసుకున్నాడు. తాను ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు పరిమితిని సుమారు రూ.4 లక్షల వరకు పెంచుతానని నమ్మబలికాడు. సాల్మన్‌రాజు బ్యాంకు ఖాతా, క్రెడిట్ కార్డు ఓటీపీ వివరాలు తెలుసుకుని ఈ నెల 16, 17 తేదీల్లో 3 దఫాలుగా మొత్తం రూ 1,30,000 తన ఖాతాకు బదిలీ చేసుకుని ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయానని గుర్తించిన సాల్మన్‌రాజు సైబర్ క్రైం టోల్ ఫ్రీ నెం 1930కు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఎల్బీనగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.